సూర్యసుత

౧

ఆనాడు నేను త్రివేణీసంగమంకడకు పోయినాను. యమునానదీ నీల ప్రవాహాలలో ఈదులాడే పెద్ద పెద్ద తాంబేళ్ళు పడవల్లోనుండి యాత్రికులు జల్లు మరమరాలను గబుకు గబుక్కున మింగివేస్తూ నీటిక్రిందికి ముత్యాల బుడగలలో మాయమవుతున్నవి. ఎన్ని యుగాలనుండి ఈ కూర్మాలు యమునాజలాల విహరిస్తున్నవో ఆనదీమతల్లికి కూర్మవాహిని అని పేరువచ్చింది. తెల్లని నుడిగుండాల గంగాప్రవాహం, నీలస్రవంతీరమణీమణిని గాఁగిలించుకొనే ప్రదేశానికి మాపడవ వచ్చింది. నేను మంచి ఈతగాణ్ణి. పడవ యమునా కృష్ణగభీరాలపై పోతున్నప్పుడే తటాలున నీటిలోకి ఉరికి మునిగి లోతులకు దిగిపోయాను. నీలమణుల కాంతి స్వచ్ఛగగనాంశుజాలము నన్ను పొదిగి వైచినట్లయింది. మందగజయానములగు కచ్ఛపాలు ఇటునటు నన్ను చూచికొనిపోయినవి. ఆనిర్మల శీతలజల ప్రదేశాలలో చిన్నిపాపలా చిట్టిమీనంలా చేతులాడిస్తూ కాళ్ళుకదుపుతూ విహరించాను.

నీటిలోపలి లోతులలో ముందు కొంతదూరము సాగిపోయేసరికి శ్వేతరేఖాపుంఖాలు అతివడిగా నావైపునకు చొచ్చుకొని వచ్చుచున్నట్లయింది. నేను భ్రమించి నిస్తబ్ధుడనై చేతనముడిగి ఆగిపోయినాను. ఆసుడుల్లో నేను వానాలపై గిర గిర తిరుగ నారంభించాను. భయముచే ఊపిరాడక ఒక్కనిమేషమాత్రం తన్నుకొని జలప్రవాహం పైకివచ్చా. పడవలోని నా

స్నేహితులు "అబ్బా, ఏమిరా! నువ్వింక కనపడవే అనుకున్నాము ఒక నిముషంపైగా నీటిలో వున్నావే!" అని అన్నారు నావదగ్గిరకువచ్చింది. అందుపట్టుకొని నావతోపాటు గంగానదీ యమునాధునీ కలిసె ప్రదేశం లోనికి వచ్చాను. గంగానది లోతులేదు. యమునలోతు. యాత్రికులు స్నానమొనరించే వీలుకోసం పురపాలకసంఘంవారు ఆ ప్రదేశాల నదికి చాలా లోపలి భాగంవరకూ కఱ్ఱలపాతి వానిపై పలకలనువరిగించి నీటిపైనే దారి యేర్పరిచినారు. ఒక పురోహితుడు "త్రివేణిసంగమస్థానే సకలపాప పరిహారణార్థం గంగా యమునా సరస్వతీ సంగమస్నానం కరిష్యే" అని మంత్రాలు చదువుచుండగా మేమందరం స్నానాలుచేసి పవిత్రులమయ్యాము

౨

త్రివేణీసంగమచిత్రం నామనస్సు కలచివైచినది. మరునాడు సాయంసమయాన మరల పోయి అంతర్వాహినియగు సరస్వతీ ధునీమతల్లిని దర్శించుదాముగాక అని నీటిలోనికి ఉరికినాను ఆపవిత్ర ప్రదేశమంతా వెదకినాను. ఊపిరాడక బయటకు వస్తూ మళ్ళా మునుగుతూ బంగారవర్ణ మెరసికొనిపోవు ప్రవాహమాల ఆ నీలిసుడుల్లో ఏ తెలివడల్లో ఎక్కడైనా ప్రత్యక్షం అగునాయని ఈదులాడినాను. విసిగివేసారి ఒక్కయామం ప్రయత్నించి సంగమస్థానం కఱ్ఱలకడ తేలినాను. తలనుండి ప్రవహించే కాలువల్ని వేళ్ళతో తుడిచికొంటూ, నీటిపొరలు క్రిమ్మిసకనుల మిటుకరిస్తూ ఎదుటచూస్తే, ఎవ్వరూ లేని ఆ ప్రదేశాన అప్రనావాన ఈదుతూ ఒక బాలిక కానవచ్చింది.

కన్నుల తుడిచికొని మరల చూచా నల్లని పట్టుకుచ్చుల వేణీభరం యమునానీలజల ప్రవాహాల ఒరిసికొని కలసిపోవగా మిరుమిట్లు కొలుపే బంగారంతీగె చేతులతో నీటిని వెనుకకు తోసుకొంటూ, నవ్వుమొగంతో ఆమె ఆనీట తేలుతూన్నది. ఇటూ అటూ ఏదైన పడవ ఉందా అని చూచాను. నావలుగాని తీరాలబండిగాని, ఇతరమనుష్యుల దర్శనంగాని నాకు కనుచూపుమేర ఏవైపునా కనబడలేదు. కొంచెము ఆశ్చర్యం పొందాను. కోటసంగతి జ్ఞప్తికివచ్చింది. అలహాబాదుకోటలో ఆంగ్లేయ కుటుంబాలు అనేకం ఉన్నవి. ఆంగ్లేయబాలిక ఎవరో ఈదులాడుతున్నది కాబోలు అనుకొని, మన దేశస్త్రీలట్టి సంతోషాలకు పెట్టిపుట్టరుకదా అని నిట్టూర్పువిచ్చి, ఆశ్చర్య హృదయాన ఆ బాలికనే చూస్తూ నీటిలో నిలిచిఉన్నాను.

ఇంతట్లో ఆమె నన్ను తనకడకురమ్మని సైగచేసింది. హృదయం దడ దడమంది. అదియేమిటనీ! నన్నుకాదు, నా వెనుక ఎవ్వరైనా ఉన్నారేమో అని వెనుక్కు చూచా. ఒక్కరిజాడ లేదు. మళ్ళీ ఆమెవైపే చూచా. ఆమె స్పష్టంగా నావైపు చేయి విసరింది. ఆసాయం సమయాన ఆ ప్రవాహాల బంగారు సూర్యకిరణాలు ఆమె బాహువుల తళుకులకు ఎంతమాత్రం తులతూగలేవు. కొంచెము భయపడుతూనే బారయీతలో మకరంలా ఆమెకడకు పోయినాను.

ఆమె ఆంగ్లబాలిక కాదు. చెవులకు కాంతుల మెరయు వజ్రాల కర్ణాభరణములున్నాయి. మనోజ్ఞమై మేఘాలమాటునుండి మేలమాడుతూనవ్వే బాలభానుబింబంలా ఆమె ఫాలాన ముత్యాల పాపటబొట్టు వ్రేలాడుతోంది మెలికలలో, నీలితళుకులలో, వంపుల మృదువులలో ముంగురులు, నీలిచాయలలో కలుస్తూ చెట్లనీడల తిరుగాడే సూర్యకిరణంలా, బంగారుపట్టులా ఆమె

వెనకనే వేణీధరం ఆనీటిలో ఆమెచుట్టూ వ్యాపించి ఉంది. నీట ప్రతిఫలించే సంధ్యాంశువులులా ఆమె కన్నులు నవ్వుతూ పక్ష్మాలమాటునుండి నన్ను చూచాయి.

ఈమె ఒక గొప్ప బ్రహ్మసమాజిక కుటుంబం బాలిక అనుకొన్నా! ఇంగ్లీషుభాషరాని బాలిక ఈత నేరుస్తుందా అని "ఎందుకుపిల్చినారండి?" అని ఆంగ్లంలో ప్రశ్నించాను" నాకు బాషలన్నీ వచ్చునండీ! మీ తెలుగు భాష చాలా తియ్యనైన భాష అందులో నే నాతో మాటాడవచ్చునులేండి" అని యామె అంది. నాకుకలిగిన ఆశ్చర్యానికి పరిమితేలేదు.

నేను—మీరెవరు? ఎందుకు నన్ను పిలుస్తా?

ఆమె—నువ్వు కంగారు పడకపోతే చెపుతా!

నేను—చాలా ధైర్యస్తుణ్ణే!

ఆమె—నేను సూర్యదేవుడి కూతుర్ని.

ఆ బాలిక నన్ను వేళాకోళాలు చేస్తోందికాబోలు అనుకొన్నాను. తెలుగవచ్చిన ఈ బాలిక ఎవరు? ఈ ప్రయాగలో నివసించడానికి కారణం ఏమిటి? అని నామనస్సు పరిపరివిధాలపోయింది.

ఆమె—నేను ఆంధ్రబాలికను కాదయ్యా! నువ్వు సరస్వతీనదీ ప్రవాహము చూడాలి అని వచ్చావు. నువ్వు చదువుకొన్నవాడవుకదా! సరస్వతీ ప్రవాహము కథలలో ఉందికాని. ఇక్కడ కనబడుతుందా ఎందుకయ్యా ఇంతవరదాకా ఒకటే నీటిలోతుల్లో ప్రాకులాడుతున్నావునువ్వు?

నా హృదయంలో ఏదియో ప్రతిధ్వనించిపోయింది, నా మనస్సులోని సంగతులీమె కెట్లా తెలిసినాయి? నాగుండె మహావేగంతో లోకాలు చరింప సాగినది.

నేను—మీరు చెప్పే సంగతులు నాకు అర్థంకావటంలేదండీ?

“నేను సూర్యుని పుత్రికను. యమున మా అక్క! నేను రంగులమ్మాయిని. అప్పుడప్పుడు మా అక్క కెరటాలల్లో ఆడుకుంటూవుంటాను. నీకు నిజంగా అంతర్వాహినియగు సరస్వతే కనపడాలంటే నాతో రా!”

అని ఆమె నీటిలోనికి మునిగినది. ఆ నిర్మల నీరాలలో స్నిగ్ధమై, బంగారు చేపలా దిగంబరయై ఆ బాలిక స్వర్ణకాంతుల ఒరసికొనిపోతూ తన దేహంచుట్టూ వివిధవర్ణాల వెలిగొంగు శ్రేణీభర పీఠికలు వ్యాపిస్తూఉండగా మునిగిపోయింది. నాచేయిపట్టుకొని తనవెంట లాగికొంటూ నీటిలోనుకోకి దిగిపోయింది. ఆమె హస్తతలం నా చేతిని పట్టగానే నా ఒళ్ళంతా విద్యుల్లతలు పాకిపోయినాయి. అత్యంతశీతలమైనట్లుగా, మహోష్ణ ప్రవాహమైనట్లుగా, శుభ్రమోహన గంధాలు అలమినట్లుగా ఆమె స్పర్శ నన్ను ఎంతో వివశత్వంతో ముంచింది. అలా ఆకర్షింపబడి ఆమె వెనుకే ఈదుకొంటూ నీటిలో మునిగిపోయినాను.

ఇరువురం ఈదకొంటూ ఎన్ని లోతులకు పోయినామో? కొంతవరకి ఆమె భూమిపై నిలిచింది. నేనూ అప్పుడే ఆమె ప్రక్క నిలిచాను. ఆమె నా సర్వస్వం లాగుకొని చిరునవ్వునవ్వి నా ఫాలము స్పర్శించింది. నా ముఖాంచలాలమట్టు వేళ్ళతో స్పృశించి నా చుబుకం ఎత్తి “ఏమయ్యా రసపిపాసీ! నీ హృదయంలో సరస్వతీనదీ ప్రవాహాలు దర్శించాలని దివ్యకాంక్ష కలిగింది కాదూ! నేను సూర్యసుతను. చం. సూర్యమండలమధ్యస్థ శీతలధారాల సర్వాగసాత్మకుడైన సూర్యదేవుడు అధివసించి ఉంటాడు. ఆతనికి నేనూ మాయమునా ఉద్భవించాము. గంగ సూర్యసహోదర, సరస్వతీ నదీమతల్లి సావిత్రీత్రయమైన సూర్యతనయ, గంగాయమునా సరస్వతీసంగమం కావ్య చిత్ర, గానసంగమమే! ఈ త్రి వేణీసంగమ రహస్య జిజ్ఞాసువువైన నీయందు

నా మనస్సు లగ్నమైంది. నీకు నేను ప్రత్యక్షమైనాను!" అని ఆబాలిక కిల కిల నవ్వింది.

నాకుఅంతా అగమ్యగోచరం అయింది. ఈ బాలిక ప్రత్యక్షం కావడం ఈ రోజులలో ఏలా సాధ్యం? అది కథలలోమాత్రం ఉన్నది.

"అనుమానం ఏందుకుస్వామీ?"

"ఇప్పటికీ నాకు ఇదంతా మాయా! లేక ఈదలేక నేను నా ప్రాణాలు భౌతికంగా వదిలివేస్తే నాకు నీదివ్యదర్శనం అయిందా? ఏమీ తెలియక ఈలా నిలుచుండిపోయాను!"

"ఓయి వెఱ్ఱివాడా నువ్వు కళాతపస్వివికావా?"

"కళకోసం, కళావధికోసం కళాపరమార్థంకోసం ఎన్ని సంవత్సరాలనుండో మనస్సులో, భౌతిక జీవితంలో, హృదయంలో వెదుకుతున్నాను."

"అందుకునేకాదా! నేను నీ ఎదుట సాక్షాత్కరించింది, రాత్రి త్రివేణీసంగము పవిత్ర దర్శనము చేతువుగాని!"

3

సూర్యసుతా! నువ్వు లలితకళాస్వరూపిణివి. నువ్వు కావ్యానందానివి. నీరూపమే గీతమై, నీ చూపులే నుడికారమై నీ దేహలావణ్యమే మధురమత్తతారీతులై, నీ కాకలీస్వనాలే చందస్సులై, నీవే భాసమై, నీప్రేమే రసమై నాకు దర్శనం ఇచ్చింది.

ఓ సూర్యసుతా! ప్రణయదేవీ! ఈలా నాకీ త్రివేణీసంగమం దగ్గర ఏలా ప్రత్యక్షమైనావు? నేను మనుష్యుణ్ణి, నువ్వు దేవవనితవు! నాకు కల

అయి ఉండవచ్చును. సగస్వనదీ దర్శనం చేసి, ఆ చీకట్లలో మేం ఇద్దరం పైకి తేలి ఈగులాడుతూ. ఆమెచే ఆజ్ఞాపితుడనై అలహాబాదులో మా మకాముకు వచ్చాను.

"ఎక్కడికి వెళ్ళావురా?" "ఇంత సేపూ ఈతేనా!" "మతి ఉన్నదా!" అనే ప్రశ్నలు స్నేహితులు వర్షం కురిపించారు.

నా రహస్యం ఎవరికి చెప్పను? ఇంత చిన్నతనంలో నాకు మతిపో యిందనుకుంటారా? అప్పటికి కాలేజీలు విడిచిన కొత్తసంవత్సరాలు "బాపిరాజును మదరాసు మోదివాకం ఆస్పత్రిలో చేర్చండిరా" అంటారా!

ఆమె వారికెందుకు ప్రత్యక్షం కాకూడదు? నాతో మాటలాడిన విషయాలు వారితో ఎందుకు వ్యక్తంచేయరాదు.

కాని ఆమెను కలుసుకొన్నాను! ఆ నీటిలోతుల్లో బంగారు వెలుగులు ప్రసరించిపోతూ ఉండగా, బంగారుపద్మాలు తన బంగారు వేణీభరంలో ధరించి తెల్లని హిమస్వచ్ఛ శరీరయై, మకరవాహనయై, తెల్లని పద్మాలు అలంకరించుకొన్న జాహ్నవి కుడిచేత పట్టుకొని, నీలికలువలు నీలిజడలలో అలంకరించుకొని, నిర్మలనీలాకాశ సదృశ శరీరయై, కూర్మవాహనయైన యమునా దేవి చేతిని ఎడమచేత పట్టుకొని నాకు ప్రత్యక్షమైన సరస్వతీదేవి. ఆ త్రివేణీదర్శనము నిజముకాదా?

నాకా దర్శనంకాగానే ఆ నీటిలోతుల్లో ఆమెతో వారి ఎదుట మోకరించాను! వారు మమ్ము ఆశీర్వదించినారు. ఆ తర్వాత వారు ముప్పురూ మాయమైనారు. మేము ఇరువురమూ పైకి తేలివచ్చినాము.

"ఓయి శిల్పీ, మేము దివ్యవనితలం, మాలో కొందరికి మానవులపై ప్రణయవిలసనం కలుగుతుంది. నిన్ను నేను ప్రేమించినాను! ఇది విచిత్రమని అనుకోకు, కవివైన నీకు నా ప్రేమలోని నిజం తెలియదా రాజా!" అని ఆబాలిక అన్నది. అప్పుడు నేను.

"మర్త్యుడను నేనటే
అమరకాంతవు నువ్వటే
నీకు నాకు పొందు ఎట్లా?

కలల మునిగిన నేనటే
కలల మధ్యను నీవటే
నాకునీకూ చెలిమిఎట్లా?

దైహికమ్మున నేనటే
దేహాన కావలను నీవటే
నీకునాకూ కౌగిలెట్లా"

అని నేను ఎవరో ఒక ఆశయకాంతను చంద్రికగా దూరాన నా స్వప్నాలదర్శించి నా చిన్నతనంలో గోదావరీ తీరాంగ్ల విద్రాశ్రమవాసినై పాడుకొన్నాను.

ఆపాట ఇప్పుడు మళ్ళీ పాడితే ఆ బాలికవిని నవ్వుతూ నాతోపాటు యమునాజలాల తేలియాడుతూనే పాడింది.

"ఒక తారకాకాంతి

ఒకదివ్యలిప్తలో
వీడి నేలకువచ్చి
ఆకాంతి పుంజమే
ఆనాడు రెండయ్యె
రెండు కిరణాలలో
ఒకటి నీ నేనోయి
ఒకటి నువ్వోయీ !
నువ్వు మర్త్యుడవైతి
నేను దివిజను సుమ్మ
జన్మ జన్మాలుగా
తన్మయకళాపూజ
శిల్పిగా భిక్షుగా
కవివౌతు నటుడౌతు
పాటలో పదగతిలో
నన్నుగూర్చే పాడినావు
నన్నుగూర్చే ఆడినావు !
ఒకనాడజంతాను
ఒకనాడు ఆంధ్రపురి
ఒకనాడు బెన్వెంటో
ఒకనాడు కోజెట్టి
నాబొమ్మ లేపేసి
నన్ను శిల్పము చేసి

ఆగతిచ్చావురా
ఆత్మనర్పించావు
వెదుకుతూ వెదుకుతూ
నిదర లేనికలల
నన్నుగూర్చే పాడినావూ
నన్నుగూర్చే ఆడినావూ !
ఈనాటికీజన్మ
ఈరూపు ఈప్రేమ !
ఈ త్రివేణిలో వచ్చినావూ
ఈవు నేనే సుమ్మా ఇచటా !”

అనిపాడి పక పక నవ్వింది,
ఈమాటనన్నీ స్నేహితులకు ఏలా వర్ణించి చెప్పగలను.

౪

నా ఈ యౌవనంలో నాలోని ఏదోశక్తి నన్ను పరవశుణ్ని చేస్తూ నా హృదయంలో రాగాలు పాడిస్తూ ఈలా ఈత్రివేణీ సంగమంకడకు కొనివచ్చింది.

అక్కడ ఈబాలిక నాకేలా ప్రత్యక్షమైనది. నమ్మనా, నమ్మగలనా ? నమ్మక ఏమిచేయను. ఆ బాలిక తన వేణిలో అలంకరించుకొనిన నీలికలువను నాకు ప్రేమతో తీసి ఇచ్చింది. ఆకలువపూవు పట్టుకునే యూబనకు

వచ్చాను. "అది ఎక్కడిదిరా ఇంత అందమైన నీలికలువ మన ఆంధ్ర దేశంలో లేదు" అన్నారు స్నేహితులు. ఆ పూవు నిజమే! ఆమె నిజంకాదా ?

మేము ఇద్దరం ఆరాత్రి విడిపోయినప్పుడు పకపకనవ్వుతూ ఒక్కసారి నన్ను గాఢంగా తన హృదయానికి అదుముకొని నాకనులమధ్యముద్దిడి నీటిలో ఉరికి మునిగిపోయింది.

ఆమరునాడు సాయంకాలం ఒక్కణ్ణే వెళ్ళినాను ! ఆమె దర్శనమే లేదు. ఒక్కణ్ణే! అక్కడ ఆమెను "సూర్యసుతా ! సూర్యసుతా !" అని పిలిచినాను.

ఏదో తీరని ఆవేదన. నేను చల్లగా మూర్ఛపోయానుకాబోలు.

నా స్నేహితులు నాకోసం వెదుకుకుంటూ వచ్చారు. నన్ను మూర్ఛలోనుంచి లేపడానికి ప్రయత్నించారు. నిష్ఫలంఅయి, వెంటనే బండిలో మకాముకు తీసుకువెళ్ళి ఒకవైద్యుణ్ణి తీసుకువచ్చారుట. అయన ప్రయత్నించి విసిగి వేసారి వెళ్ళిపోయాడు.

ఉదయం నాకు మెలకువవచ్చింది. బలహీనత లేదు. జ్వరంలేదు. ఒక స్నేహితుడు సూర్యసుత నాకిచ్చిన నల్లకలవను చూపిస్తూ "ఒరే! బావన్నా!! ఎక్కడ సంపాదించావురా చెక్కుచెదరలేదిది" అన్నాడు.

నాగుండె మహా వేగంతో మోగిపోయింది. బలవంతంగా నా స్నేహితులను ఆ పట్టణంలో వొదలగోజలాపాను, ఆమె దర్శనంమాత్రం సున్న..

త్రివేణీ సంగమంలో ఈదాను. నీటిలోతుల్లో ఊపిరాడనంతవరకూ నిలిచాను! ఆ దినాన గంటలు ఊపిరాకింది ఈ దినాన ఒకనిమేషమూ నీటిలో ఉండలేకపోతున్నాను.

౨౪

మేమంతా తిరికి మాఊరు వచ్చివేశాము. నేను చిక్కిపోయినానట. నాకళ్ళు గుంటలుపట్టేనంట. నా పెదవులలోని నవ్వులు ఇంకేడకో ఇంకిపోయినవంట !

నా ప్రేమ! దేహసంబంధమైనదికాదు. అవునుకూడా! కామతృప్తి నేను వాంఛించినానా? ఆ దివ్యబాలిక ఆ పరమసుందరి నా సూర్యసుత నా చిన్ననాటనుండి నా కలలలో నాఎదుట దూరాననోచే వెన్నెలలరాణి సౌందర్యరసాధిదేవి, తిరువేణీకడ దర్శనమిచ్చి నాకు తన పరమ సౌందర్య రూపంతో పవిత్రత్వమై ఆలా మాయమైన ఆ బాలిక దేహము నేనెలా వాంఛించను? ఆమె నిజముకాదన్న ఆమెనాకు ప్రేమాంకితము చేసిన నీలి కలువ వాడక; పరిమళము వీడక నా మంజూషలో దాగియున్నదే?

గయాకాంగ్రెసును సభ్యునిగాపోయి తీర్థయాత్రసేవితుడనైన నాకీ పరమరహస్య సందర్శనమేమిటి ఈ ఆవేదనా జీవితమేమిటి?

అవును నా చిన్నతనానుండి చంద్రికాంతిరూపిణియైన వెన్నెల బాలికను ప్రేమించాను. ఆమెకై పాటలుపాడాను. ఆమె నా హృదయంలో సౌందర్య పరమావధి. నా ఎదుట నేను దర్శించే బాలలు మామూలువారు. కొందరు ఎక్కువ అందాలవారు !

పట్టి దేహసౌందర్యమా మనుష్యుడు జీవితంలో వాంఛించేది ?

దేహసౌందర్యము మనుష్యుడు కోరతాడు. ఆతనికి ఆశయమైన దేహసౌందర్యము ఆతడు వాంఛిస్తాడు. కాని ఏదివ్య ముహూర్తంలోనో ఎవరో ఒకబాలిక, ఆతనికి సందర్శనమిస్తుంది, ఆతడు ప్రేమించని మునుపు

ఆతని హృదయాన, ఆతని స్వప్నాల ప్రత్యక్షమయ్యే బాలికకు ఉన్న రూపం వేరు, ఈనాడు తన సర్వస్వమునూ అద్భుతమై మహాశక్తివంతమైన ఆప్రేమాకర్షణ చేసిన వ్యక్తిరూపం వేరు.

నాకలలలో ఉన్నవ్యక్తి మసక మసక చీకటివెనక ఉండేది. నేను త్రివేణీసంగమంకడ ప్రత్యక్షమైన ఆనగ్నబాలిక ఈనాడు సుస్పష్టమైన ఆనాటి తెరవెనక బాలికే!

ఎవరీ మూర్తి, సూర్యసుత అనే పేరు ఏమిటి? నేను వర్ణవిన్యాసలీలా యోగిని, ఆమె వర్ణవిన్యాస కళాధిదేవ! నేనా? నేను కంఠాన మధురాలు సాగపుల్కుల పొందుతూ గీతికల పాడుకొనే యువకుడను, ఆమె దివ్యబహ్మ రైన సూర్యదేవుని అనుగు తనయ

సూర్యతనయవు నువ్వు దేవీ
సొబగులాడివి కాదె నీవూ,
నీలోచనాలలో నీలిచూపులలోన
నిత్యభాసితమంట నిఖిలవర్ణాలటే సూర్య.
నీనవ్వులో విరిసి నీమాటలో వెలసి
నిర్మలరసానంద నిరతిశయకావ్యాలు!"

మేము బాలకులం! ఒకకొత్తలోకం, ఒకకొత్తవేగం, ఒక కొత్తశక్తి ఎదుట. వెనక్కు వెళ్ళమనస్సు ఒప్పదు. ముందుకు సాగిపోవ ధైర్యంచాలదు. ఆముందులో త్రివేణి ఉన్నది. ఆ వెనకలో త్రివేణి ఉన్నది. నేడు నేనుదర్శించిన త్రివేణికి అర్థమున్నదా?

నదులుగా ప్రవహించే మా హృదయాలు నదములై పాశ్చాత్య దిశోన్ముఖాలైనాయి. హిమాలయ శిఖరసౌందర్యంలో భాగస్వాములమైన మాకు

బయళ్ళు, అడవులు, రోగాలు, క్షుధ, సిద్ధార్థరాజకుమారునికి వల్లేదర్శనం అయ్యాయి.

పొలంలో కర్షకుడు, పొగగొట్టంపక్క కూలివాడు, ప్రాణంపోసిన ఇనపవస్తువులు, ప్రకృతిని కైవసంచేసుకొనబోయే ప్రజాహృదయం.

సూర్యసుతా అగ్నిస్వరూపిణీ! ఆనందమూర్తీ ఎక్కడేనువ్వు?

౬

ఏచదువులానాటివి? ఈనాడు దేవతామూర్తివంటి నాగురువు నన్ను పంథమాన్న గంగా యమునా సరస్వతీ సంగమ సౌందర్య రహస్యం తన నిడివైన వెన్నెలలో గులాబిమొగ్గవంటి దేశికాంగుళితో చూపించినాడు

నీవెనకవోబిడ్డ నిలిచినావీ బయలులో
నీజన్మ వెనకేమి, నీజాతివెనకేమిరా ?
వెనుక తెలియనినీకు వేగ పొందుకుబాల
వెనకముందుల శ్రుతికి వేయిఅడుగులుముందు ! "

అన్న ఆతని ఆంగ్లగీతము నాకు ఝల్లుమనిపించింది.

నీవరునదిలేక నీవరు ఆనకట్టలేదు, టెన్నెసీనదిలేక, టెన్నెసీ ఆనకట్టలులేవు. అనేక యుగాలనాటి గోదావరికి ఈనాటి ఆనకట్ట ధవళేశ్వరం దగ్గర! ఇంక ముందెన్ని ఆనకట్టలై సర్వప్రపంచమూ సస్యశ్యామలమానో!

నా సూర్యసుత మాయమైన ఈ ఆవేదనతో మావూరునకు పదిమైళ్ళ దూరంలో ఉన్న సముద్రతీరంలో కూర్చుండిఉన్నా! నాపక్క ఎవరో కూర్చున్నట్లే తోచింది.

ఏదో మధురమత్తత నన్నలమి కేసింది. ఏదో దివ్యపరిమళాలు నాకు వివశత్వం కలుగజేస్తున్నవి. గజగజ వణకినాను తల నిమ్మదిగా తిప్పినాను. నాపక్క సూర్యసుత నా వైపు ప్రేమపూరిత వీక్షణాలు పరుస్తూ కూచుని ఉన్నది.

"సు...సు...వ్వేనా!" అని నేను గద్గద స్వరంతో పలికాను.

"ఏమిటి అలా వణుకుతావు స్వామీ!" అని ఆమె ప్రశ్నించి, నా మెడచుట్టూ తన వెన్నెల కిరణాల చేతులు పెనవైచింది.

అది ప్రేమా! అదిమహాద్భుత సౌందర్యానుభవమా? అది సర్వ మానవ హృదయ పరివాహామా?

ఆమె నాకు ప్రసాదించిన అధరోష్ఠామృతము ఆకాశ తేజస్స్వరూప క్షీరసముద్రమథనజనిత మేనా?

ఆమె మాటలు త్యాగరాజస్వామి గీతాలా? పొలాల సాయంత్ర నాల ఎరుపు వెలుగుఅంచుల కలిసిపోవు పొలము పదుమలవలపుల పాటలా? గోధూళిధూసరిత గోపబాలకుని పిల్లంగ్రోవిస్వనాలా? పాలకై కాలకుకట్టిన చిట్టిపగ్గాల లెక్కగొనక ముంగుకురుకు ఆవుదూడల అంభారవాలా? గడ్డికోసిన మా లేతల పవిత్రకంఠగళక్రమగాంధర్వమా? ధాన్యయాత్రాన పని చేసి ఇంటికరుగు కూలీలజట్టుల గంభీరసంతోషనాదాలా?

"బాపూ! వచ్చానా? ఇంత ఆవేదన ఎందుకు, రానని?"

"నువ్వు దేవవనితవు నాకూరకకైకొంటావు! నాకు సహధర్మిణివి కాగలవా దేవీ?"

"ఓయి అమాయకబాలకుడా! లేకపోతే నీకు త్రివేణీ సంగమంకడ ఎందుకు కనుపించావు?"

"కనుపించావు, నా హృదయాని పువ్వు నలిపినట్లు నలిపావు."

"ఓయి కళాతపస్వీ! విను అనుమానం నీ హృదయంలో ప్రవేశించింది. నేను మాయమయ్యాను. ముందుకు పోయేవాడు వెనక్కు చూచి, వెనకసంగతి తెలుసుకొని, వెనక్కు శ్రుతిగా ముందుకు పోవాలి. బయలుదేరే వూరుఉంది. చేరేఊరుఉంది. విశ్వకళాకారునికి బయలుదేరిన ప్రదేశం తెరవెనక, చేరవలసిన ప్రదేశం తెరవెనక. కాని వెనకప్రదేశాలు తెలుసును ముందుచూపుకు గోచరమయ్యే ప్రదేశాలున్నాయి. అంతేకాని వదిలిన మజిలీకే మళ్ళీ చేరుతావా?"

"ఓసి దివిజబాలికా! నాకు వేదాంతంరాదు. కాని కళాతపస్వినై నిన్ను ప్రేమించగలను. నీ దివ్యవినీలలోచనాలలోని పరమ సౌందర్యాలు దర్శిస్తూ యుగాలు ఉండిపోగలను. నీ అద్భుత రేఖాసమన్వితాశయ రూపం ఎదుట పవిత్రార్చనలో కాలాంతమువరకూఉండిపోగలను. నీకాశ్మీరజామృతమస్నృణాధరాల నాకరకు పెదవుల అనంతముగా గాఢచుంబనాలీయగలను. సౌందర్యభావ దివ్యమూర్తమైన నిన్ను అదిమే నా యీ కఠినదృఢతరాశ్లేషంలో నిత్యుడను కాగలను దేవీ! దేవీ!!" అన్నాను.

"అలాగునా! అయితే సందేహం ఎందుకు? నేను కళను, నువ్వు కళాతపస్వివి, మనసంయోగము కళాసృష్టి. నేను అమృతాన్ని, నువ్వు అమరుడవు. మన సంయోగము లోకకల్యాణప్రదంకాదా? అన్నది."

పిపాసార్తుడనైననే నా సుధాకలశిని పొదవుకొన్నాను.